

లక్ష కుంకుమార్చన
శ్రీశైలంటెంపుల్: పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో గురువారం సాయంత్రం శ్రీభ్రమరాంబాదేవికి లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



ఎమ్మెల్యే చెప్పారని..
ఎమ్మెల్యే చెప్పారని ప్రభుత్వ స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా ధారాదత్తం చేస్తున్నారు. డోన్ కొత్తపేటలోని సర్వే నంబర్ 281లో వారం క్రితం భూమిపూజ చేశారు. 8లో▸



పదహారు రోజుల పండుగ
మహానందిలో గురువారం పదహారు రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. రథాన్ని మండపంలోకి చేర్చారు. స్వామిఅమ్మవార్లకు చీర, సారె సమర్పించారు. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:33	ఉ॥ 5:05
ఆదోని	సా॥ 6:32	ఉ॥ 5:06
నంద్యాల	సా॥ 6:29	ఉ॥ 5:04
ఆత్మకూరు	సా॥ 6:28	ఉ॥ 5:00
బనగానపల్లె	సా॥ 6:31	ఉ॥ 5:02

హదీస్ వెలుగు :
అబద్ధాలు చెప్పడం చాలా పాపం. అల్లాహ్ వీరి ప్రార్థనలు అంగీకరించరు. రోజా ఉండి అబద్ధాలు చెబితే రోజా కూడా దీలా పడుతుంది. అంతటి పాపం చేకూర్చే అబద్ధం నుంచి నియంత్రణలో ఉండండి. – పవిత్ర ఖురాన్

నిలువునా ముంచి.. కప'ట మాట'

రాష్ట్రంలోని టీడీపీ నేతలు కపట రాజకీయాలు చేస్తున్నారు. ఇందుకు టమాట ప్రాసెసింగ్ యూనిట్‌ను వాడుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఈ పరిశ్రమకు ఊపిరి వచ్చింది. పనులు కూడా చకచకా సాగుతున్నాయి. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి అంతా మారిపోయింది. అ'ధనం' కోసం ఆ పార్టీ నేతలు కాంట్రాక్టర్‌ను వేధించడంతో పనులు ఆగిపోయాయి. రైతుల నుంచి వ్యతిరేకత వస్తున్న విషయాన్ని తెలుసుకుని ప్రణాళిక మార్చుకున్నారు. యూనిట్ ఏర్పాటు చేసే స్థలాన్ని మార్చి భూమి పూజ అంటూ సరికొత్త డ్రామాకు తెరతీశారు.

- దురుద్దేశంతో దూదెకొండకు టమాట ప్రాసెసింగ్ యూనిట్ మార్పు
- మాజీ సీఎం వైఎస్ జగన్‌కు మంచి పేరు రాకుండా ఉండాలన్నదే ఉద్దేశం
- వైఎస్సార్‌సీపీ హయాంలోనే టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు శ్రీకారం
- రూ.15 లక్షలు ఖర్చు చేసి పిల్లర్లు కూడా ఏర్పాటు
- ప్రభుత్వం మారడంతో ముడుపుల కోసం టీడీపీ నేతల ఒత్తిళ్లు
- తట్టుకోలేక పారిపోయిన కాంట్రాక్టర్


మార్కెట్‌లో ధర లేక నిల్వ ఉన్న టమాట (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు.. ఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్లు, విభజన తర్వాత ఏర్పాటైన రాష్ట్రానికి 5 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ 14 ఏళ్లలో ఏ నాడు కూడా జిల్లాలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేయలేదు. రైతుల కష్టాలు, కన్నీళ్ల గురించి పట్టించుకోలేదు. పత్తికొండ ప్రాంతంలో టమాట జ్యూస్ ఇండస్ట్రీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మాటను సైతం చంద్రబాబు మరచిపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పరిశ్రమ పూర్తయితే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందనే భయంతో ప్లేటు మార్చారు. హడావుడిగా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు జీవో ఇచ్చారు. కర్నూలు ఎమ్మెల్యే, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పట్టించుకోని కూటమి ప్రభుత్వం హడావుడిగా భూమి పూజ కార్యక్రమం చేపట్టడంపై రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


వైఎస్సార్‌సీపీ హయాంలో టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు వేసిన పిల్లర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

గతంలో పనులు ఇలా..
టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మొదలైంది. అప్పట్లో పత్తికొండ సమీపంలోని హోసూరు గ్రామం సర్వే నంబరు 286/1ఏ3, 286/1ఏ4, 286/1ఏ5ల్లోని 3.60 ఎకరాల భూమిని కేటాయించారు. రూ.12.05 కోట్ల నిధులతో బిల్డింగ్ నిర్మాణంతోపాటు మిషనరీలు ఏర్పాటు చేసే విధంగా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిర్మాణపు పనులు కూడా మొదలై చురుగ్గా జరిగే స్థాయికి వచ్చాయి. దాదాపు రూ.15 లక్షలు ఖర్చు చేసి పిల్లర్స్ కూడా వేశారు. అయితే గత ఏడాది మే నెలలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ గెలిచి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే సమీకృత టమాట ప్రాసెసింగ్ యూనిట్ గ్రహణం పట్టినట్లు అయింది.

ప్రస్తుత కుట్ర ఇదీ..

టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ హయాంలోనే పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ నేతలు ముడుపుల కోసం కాంట్రాక్టర్‌ను ముప్పు తిప్పలు పెట్టారు. దీంతో ఉక్కిరిబిక్కిరైన కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. దీంతో పిల్లర్లకు కట్టిన కడ్డీలు కట్ చేసుకోవడంతో పాటు సిమెంటు ఇతర మెటీరియల్ మొత్తం తరలించుకుపోయారు. హోసూరులో కేటాయించిన భూమిపై లేని వివాదాన్ని టీడీపీ నేతలు సృష్టించారు. అక్కడే ప్రాసెసింగ్ యూనిట్ పెడితే గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే ఉద్దేశంతో స్థలాన్ని దూదెకొండ ప్రాంతానికి మార్పు చేశారు.

అంతా హడావుడి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మరుగున పడిపోయాయి. కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఉల్లి, టమాట సోలార్ డ్రైయర్లు నిర్వహించే పొదుపు మహిళలను నిర్లక్ష్యం చేశారు. దీంతో వారు అప్పుల ఊబిలో కూరకుపోయారు. చివరికి సోలార్ డ్రైయర్లను సరఫరా చేసిన ఎస్4ఎస్ సంస్థ వాటిని వెనక్కి తీసుకెళ్లింది. ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును పట్టించుకోని కూటమి ప్రభుత్వం నేడు టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు భూమి పూజ అంటూ హడావుడి చేస్తోంది. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలోని సర్వే నెంబర్ 63/3లోని 2.50 ఎకరాల్లో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ఈ నెల 5న జీవో జారీ అయ్యింది. ఈ నెల 14న భూమి పూజ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన నిధులతోనే టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల దుస్థితి ఇదీ..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉల్లి, టమాట రైతుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున సోలార్ డ్రైయర్లు ఏర్పాటయ్యాయి. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని రాణించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పట్టించుకునే దిక్కులేక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. అప్పట్లో కల్లూరు, గూడూరు, గోనెగండ్ల తదితర మండలాల్లో 322 సోలార్ డ్రైయర్ల యూనిట్లు ఏర్పాటు చేశారు. ఇవి 2024 మే నెల వరకు ఇవి పనిచేశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రోత్సాహం లేక మూలనపడ్డాయి. సోలార్ డ్రైయర్లను ఎస్4ఎస్ సంస్థ వెనక్కి తీసుకెళ్లింది.

టమాట రైతుల దుస్థితి ఇదీ..
రబీ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,700 ఎకరాల్లో టమాట పంట సాగైంది. కర్నూలు జిల్లాలో 1,250, నంద్యాల జిల్లాలో 450 ఎకరాల్లో టమాట పంట సాగు చేశారు. మార్కెట్‌లో క్వింటాకు కనిష్టంగా రూ.100 వరకు, గరిష్టంగా రూ.600 వరకు ధర లభించింది. కిలో రూ.4 నుంచి రూ.5 పలుకుతుండడంతో విధిలేని పరిస్థితిలో కర్నూలు మండలం పడిదెంపాడు, ఈ.తాండ్రపాడు, నందనపల్లె, పూడూరు, శివరామాపురం గ్రామాల్లో టమాట పంటను పశువులకు మేతగా వదిలేశారు. కృష్ణగిరి పెనుమాడ సమీపంలో పొలాలను ఇలాగే వదిలేశారు. పెట్టుబడి రాక నష్టం పోయినా ప్రభుత్వం సాయం కూడా అందించలేదని రైతులు ఆరోపించారు.

రైతులు నమ్మరు



రాష్ట్ర ప్రభుత్వం టమాట రైతులను ఎప్పుడూ పట్టించుకోలేదు. మార్కెట్‌లో టమాట ధర పడిపోయినప్పుడు కనీసం స్పందించలేదు. పొలాల్లోనే పంటలను వదిలేస్తున్నా అధికారులను పంపించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు ఆపేసి ఇప్పుడు హంగామా చేస్తున్నారు. అధికారంలో ఉన్న టీడీపీ నాయకులను రైతులు ఎవరూ నమ్మరు. వారు చెప్పే మాటలన్నీ బూటకమే అని అర్థమవుతోంది.
– టి. శ్రీనివాసులు, హోసూరు, పత్తికొండ మండలం

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు
కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర ప్రధాన పరీక్షలు ముగిశాయి. గురువారం జరిగిన పరీక్షలకు 23,114 మంది విద్యార్థులకు గాను 22,479 మంది హాజరుకాగా.. 635 మంది గైర్హాజరు అయ్యారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు చివరి దశకు చేరుకోవడంతో బోర్డు అధికారులు మూల్యాంకనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 17 నుంచి ప్రధాన సబ్జెక్టుల మూల్యాంకనం మొదలు కానుంది.

రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యం
కర్నూలు: రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా పోలీసులు చర్యలు చేపట్టారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా వెంటనే డయల్ 100 , 112కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధన ఉల్లంఘనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో భద్రతా భావం పెంపొందిస్తున్నామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై నిరంతరం డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు.

సామరస్యంతో హోలీ జరుపుకోవాలి
కర్నూలు: మతసామరస్యం పాటిస్తూ సంతోషకర వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగ వేడుకల్లో ఎదుటి వారి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించొద్దని సూచించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

మద్దతు ధరతో శనగల కొనుగోలు
కర్నూలు(సెంట్రల్): మద్దతు ధరతో శనగల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ డాక్టర్ బి.నవ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. క్వింటా శనగకు మద్దతు ధర రూ.5,650గా నిర్ణయించామన్నారు. జిల్లాలో 29వేల మంది రైతులు 1,04,43.25 ఎకరాల్లో శనగ సాగు చేసినట్లు పేర్కొన్నారు.

లా సెమిస్టర్ ఫలితాల విడుదల
కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో లా సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం సీఈ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. థర్డ్, ఫిఫ్త్ ఇయర్స్ 2, 4, 6, 8, 10 సెమిస్టర్ల ఫలితాల కోసం https://rayalaseemauniversity.ac.in/ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

హంద్రీ-నీవాకు నిలిచిపోయిన నీరు


కాలువలో నీరు ప్రవహించని దృశ్యం

దేవనకొండ: హంద్రీ- నీవా కాలువకు అధికారులు నీటిని అర్ధాంతరంగా ఆపేశారు. మార్చి 15 వరకు నీటిని వదులుతారని అధికారులు ప్రకటించినా మార్చి 12వ తేదీనే నిలిపేశారు. దీంతో పంట తుది దశకు చేరుకున్న రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. దేవనకొండ మండలంలో హంద్రీ-నీవా కాలువ కింద రబీలో 8 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేశారు. మొత్తం 3 వేల ఎకరాల్లో పంటలు చివరి దశకు చేరుకోనున్నాయి. ఇంతలోనే కాలువకు నీరు బంద్ కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

రూ.210 కోట్లతో 'పందికోన' పనులు

- అధికారులు ప్రతిపాదనలు పంపాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, హాజరైన అధికారులు

కర్నూలు (సెంట్రల్): పందికోన రిజర్వాయర్‌లో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు రూ.210 కోట్లతో ప్రతిపాదనలను త్వరితగతిన ప్రభుత్వానికి పంపించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఈ నిధులతో పనులు చేపడితే ఆయకట్టు విస్తీర్ణాన్ని పెంచవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల పరిస్థితిపై జలవనరుల శాఖ అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సుంకేసుల జలాశయం, గాజులదిన్నె ప్రాజెక్టు, పందికోన రిజర్వాయర్, కృష్ణగిరి రిజర్వాయర్, హంద్రీనీవా విస్తరణ పనులు, పులికనుమ రిజర్వాయర్, 68 ట్యాంకులు నింపడం, గుండ్రేవుల రిజర్వాయర్ గురించి కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. హంద్రీ-నీవా విస్తరణ పనులను జూన్ లోపు పూర్తి చేయాలన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా 68 ట్యాంకులను నీరు నింపాల్సి ఉండగా ఇప్పటివరకు 33 చెరువులకు నింపారని, మిగిలిన ట్యాంకులను కూడా త్వరితగతిన నింపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి సమస్యలు, అవసరమైన నిధుల వివరాలు అందజేయాలని జలవనరుల శాఖ ఏసీని ఆదేశించారు. డబ్బులిస్తేనే తుంగభద్ర దిగువ కాలువ చివరి ఆయకట్టు రైతులకు నీళ్లు ఇస్తామని పత్రికల్లో వచ్చిన వార్తలపై కలెక్టర్ వివరణ అడిగారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జలవనరుల శాఖ ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి, హంద్రీనీవా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు, డీఈలు శైలేష్, రామకృష్ణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



భక్తుల గోవింద నామస్మరణ.. వేదపండితుల వేదమంత్రోచ్ఛారణ.. డప్పుల వాయిద్యాల మధ్య జ్వాలా నరసింహ స్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో గురువారం స్వామి రథోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి పరవశించిపోయారు. – ఆళ్లగడ్డ

చెమటలు పట్టిస్తున్న ఉష్ణోగ్రతలు

- కర్నూలులో 40.1, నంద్యాలలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మార్చి మొదటి పక్షంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. గురువారం కర్నూలులో 40.1 డిగ్రీలు, నంద్యాలలో 40.2 డిగ్రీలు నమోదు కావడం వేసవి తీవ్రతను స్పష్టం చేస్తోంది. 2024లో ఫిబ్రవరి చివరి నాటికే నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎండలు, వడగాలుల నుంచి ఊరట కల్పించేందుకు కర్నూలులోని ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటయ్యాయి. చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు నిర్వహించారు. ఈ సారి గత ఏడాది కంటే ముందుగానే ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

మండలం	ఉష్ణోగ్రత
ఆస్పరి	38.29
సంజామల	38.28
తుగ్గలి	38.26
హొళగుంద	38.12
పాములపాడు	38.09
ప్యాపిలి	38.04
పత్తికొండ	38.2
రుద్రవరం	38.2
సీ.బెళగల్	38.1
డోన్	38

బీసీ రుణాలపై 'పచ్చ' గద్దలు

- తాము పంపిన జాబితాలనే ఓకే చేయాలని హుకుం
- ఎంపీడీఓలను ఆదేశిస్తున్న ఎమ్మెల్యేలు
- టీడీపీ నేతల సిఫారసుతో అర్హులకు మొండిచెయ్యి
- జనరిక్ షాపులకు భలే డిమాండ్
- జనాభాలో సింహభాగం ఉన్నా 4,201 యూనిట్లే!



" ఎంపీడీఓ గారు ... బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి నేను ఒక లిస్ట్ పంపుతున్నాను. మిగిలిన వాటన్నింటిని పక్కన పెట్టి ఈ లిస్ట్‌లో ఉన్న వాళ్లకి బీసీ కార్పొరేషన్ లోన్లు వచ్చేలా చూడు ! అవసరమైతే బ్యాంకర్లతో కూడా మాట్లాడు.. ఎలాగైనా మనవాళ్లకు రుణాలు అందే తీరాలి'' అంటూ ఎంపీడీఓలను జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు ఆదేశిస్తున్నారు.


మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన ఇంటర్వ్యూలకు హాజరైన ఆశావహులు (ఫైల్)

కర్నూలు (అర్బన్): బీసీ కార్పొరేషన్ రుణాలను తన్నుకుపోయేందుకు 'పచ్చ' నేతలు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తాము సిఫారసు చేసిన వారిని కాదని, ఏ ఒక్కరికీ రుణం మంజూరైనా పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం అందజేయనున్న సబ్సిడీ రుణాలపై టీడీపీ నేతల కన్ను పడింది. తమ వారికే అందించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. పేదలకు పారదర్శకంగా సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వేలాది మంది నిరుద్యోగులు ఈ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ... ఆయా మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో జరిగిన ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇంతలో అందరి ఎంపీడీఓలకు ఎమ్మెల్యే కార్యాలయాల నుంచి లబ్ధిదారుల ఎంపిక జాబితాలను తామే పంపిస్తామని, మీరు ఎలాంటి ఎంపిక జాబితా తయారు చేయవద్దని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో రాజకీయ సిఫారసు లేకుంటే అర్హత ఉన్నా, రుణం అందని పరిస్థితి నెలకొనింది. సిఫారసు ముందు పారదర్శకత అనే పదం మంటగలిసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధినేత బాటలోనే తమ్ముళ్ల ప్రయాణం
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బాటలోనే టీడీపీ నాయకులు కూడా ప్రయాణిస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రే వైఎస్సార్‌సీపీకి చెందిన వారికి ఏ పనులు చేయకండని చెప్పడంతో దాన్ని స్థానిక ఎమ్మెల్యేలు ' తుచ 'తప్పకుండా పాటిస్తున్నారు. రుణాల విషయంలో కూటమిలోనూ అధిక శాతం పోటీ నెలకొనడంతో జనసేన, బీజేపీ నేతలను పక్కనపెట్టి లబ్ధిదారుల ఎంపికలో టీడీపీ విధేయులకే పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. బీసీ, ఈబీసీ, కాపు రుణాల్లో మితిమీరిన రాజకీయ జోక్యం చోటు చేసుకోవడంతో అర్హులకు రుణాలు అందని పరిస్థితి నెలకొనింది.

జనరిక్ షాపులకు భలే డిమాండ్
జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు సంబంధించి 50 శాతం సబ్సిడీ ఉండడంతో చోటా నేతల దృష్టి అంతా ఈ రుణాలపై పడింది. తమ ప్రాంతంలో బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తి చేసిన వారి చిరునామాలను గుర్తించి ఎలాగైనా మీకు రుణాలు ఇప్పిస్తామని నమ్మబలుకుతూ కమీషన్లు గుంజుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో 62 జనరిక్ మెడికల్ షాపులను మంజూరు చేసింది. ఒక్కో షాపు ఏర్పాటుకు రూ.8 లక్షలు అవసరం కాగా, ఇందులో 50 శాతం అంటే రూ.4 లక్షలను సబ్సిడీ ఉన్న నేపథ్యంలో టీడీపీ నేతల చూపు వీటిపై పడింది. అలాగే అన్ని పథకాల ఏర్పాటుకు గరిష్టంగా రూ.2 లక్షలు సబ్సిడీ ఉన్నందున రుణాలను ఎలాగైనా తమ వారికి ఇప్పించుకునేందుకు తాపత్రయ పడుతున్నారు.

జనాభాలో సింహభాగం ఉన్నా ...
ఉమ్మడి కర్నూలు జిల్లాలో సింహభాగం జనాభా బీసీ, ఈబీసీలు ఉన్నా, కేవలం 4201 యూనిట్లను మాత్రమే మంజూరు చేశారనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.77.19 కోట్ల రుణాలను అందించనున్నారు. ఇందులో కర్నూలు జిల్లాకు 1,673 మంది బీసీలకు, 171 మంది ఈబీసీలకు రూ.31.35 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,156 మంది బీసీలు, 171 మంది ఈబీసీలకు రూ.45.84 కోట్లను అందించనున్నారు. అలాగే కాపు కార్పొరేషన్ ద్వారా కర్నూలు జిల్లాలో 190 యూనిట్లకు రూ.6.40 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.6.35 కోట్లతో 189 యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

స్వేచ్ఛ కోల్పోయిన అధికారులు
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'నవరత్నాల ' పేరుతో కులం, మతం, రాజకీయం చూడకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించిన అధికారులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో స్వేచ్ఛ లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీఓల పర్యవేక్షణలోనే లబ్ధిదారుల ఎంపిక జరిగేది. ఎలాంటి రాజకీయ జోక్యం లేకపోవడం వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి అప్పట్లో సంక్షేమ పథకాలు అందాయని, ప్రస్తుతం తమ చేతులు కట్టేసి పనులు చేయమంటున్నారని పలువురు ఎంపీడీఓలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు

శిరివెళ్ల: యర్రగుంట్ల 2వ గ్రామ సచివాలయ గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య గురువారం తెలిపారు. గతంలో కార్యదర్శి సామాజిక పింఛన పంపిణీ అనంతరం మిగిలిన రూ. 8.48 లక్షలను తిరిగి ఏంపీడీఓ కార్యాలయానికి అప్పగించలేదు. పింఛన్ల డబ్బులు చెల్లించక పోవడంపై ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

నంద్యాల (వ్యవసాయం): హత్యాయత్నం, దాడి కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి గురువారం తీర్పునిచ్చారు. పాణ్యం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల గ్రామానికి చెందిన సందొలి అంజి, మాదిగ హరినాథ్‌లో ఒకరు పాణ్యం మండలం తమ్మరాజుపల్లికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని తరచూ వచ్చేవాడు. ఈ క్రమంలో మహిళ అత్త శివమ్మ గుర్తించి హెచ్చరించింది. అయితే నిందితులిద్దరూ 2017 ఏప్రిల్‌లో శివమ్మపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.11 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా


వాగులో బోల్తా పడి

చాగలమర్రి: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై నగ్గలపాడు గ్రామం వద్ద గురువారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి వాగులో బోల్తా పడింది. బనగానపల్లెకు చెందిన నలుగురు వ్యక్తులు తిరుమలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నగ్గలపాడు వద్ద కారు అదుపు తప్పి భవనాసి వాగులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రాజారెడ్డి, హర్షకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయ పడ్డారు. క్షతగాత్రులను టోల్ ప్లాజా సిబ్బంది ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చాగలమర్రి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

8 నెలలుగా గైర్హాజరు

- ఉపాధ్యాయుడికి నోటీసులు జారీ చేసిన ఎంఈఓలు

హొళగుంద: హొన్నూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శివశంకర్ రెడ్డి ఎనిమిది నెలలుగా విధులకు హాజరు కావడం లేదు. ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలకు డీఈఓ దృష్టికి తీసుకెళ్లి నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ-1, 2 సత్యనారాయణ, జగన్నాథం గురువారం విలేకరులకు తెలిపారు. కడపకు చెందిన శివశంకర్‌రెడ్డి 2023లో విధుల్లో చేరారని, 2024 జూలై 5వ తేదీ నుంచి గైర్హాజరవుతున్నారన్నారు. షోకాజ్ నోటీసులు, మెమోలు పోస్ట్ ద్వారా ఆయన ఇంటికి పంపినా ఎలాంటి సమాధానం రాలేదని తెలిపారు. విద్యాశాఖాధికారులకు నివేదిక చేయని పక్షంలో ప్రభుత్వ నియామవళి ప్రకారంగా శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎంఈఓలు చెప్పారు.

హమ్మయ్యా.. ఓ పనైపోయింది!


కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన విద్యార్థులు


బస్సులో ఆనందంగా వెళ్తూ..



హాస్టల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థిని, స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సు కోసం నిరీక్షణ


ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు


పరీక్షలు పూర్తి కావడంతో తల్లులతో బాలికల ఆనందం

ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టారు. పరీక్షల కోసం గంటల తరబడి చదివారు. రాత్రింబవళ్లు నిద్ర మేలుకొని ఎంతో కష్టించారు. శ్రద్ధతో పరీక్ష రాశారు. గురువారం ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులంతా ఖుషీ అయ్యారు. హమ్మయ్యా.. ఓ పనైపోయిందని గంతులు వేసుకుంటూ స్వగ్రామాలకు బయలు దేరారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్కడ చూసినా విద్యార్థులే కనిపించారు. స్నేహితులకు 'బై..బై' చెబుతూ బస్సుల్లో తమ ఊరికి ప్రయాణించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఎమ్మెల్యే దళితుడని.. ఎంపీ మహిళని!

- ప్రజాప్రతినిధులను కాదని టీడీపీ నాయకుడితో ప్రారంభోత్సవాలు
- ప్రొటోకాల్ ఉల్లంఘించిన టీడీపీ నంద్యాల పార్లమెంటరీ ఇన్‌చార్జి


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు: పట్టణంలో ప్రొటోకాల్ పాటించకుండా టీడీపీ నంద్యాల పార్లమెంటరీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి గురువారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సుమారు రూ.7 లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మించారు. అక్కడే ముఖద్వారం కూడా నిర్మించారు. ఆ రెండింటినీ శివానందరెడ్డి ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య దళితుడు కావడం, ఎంపీ బైరెడ్డి శబరి మహిళా కావడం, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి ఎంపీ వర్గానికి చెందిన వారు కావడంతో అంతా తానై శివానందరెడ్డి ప్రారంభోత్సవాలు చేయడం గమనార్హం. విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే, ఎంపీ, మున్సిపల్ చైర్మన్ పట్ల ఏమాత్రం గౌరవం ఉందో ఈ ఘటన అద్దం పడుతోందని స్థానికులు ముక్కున వేలేసుకున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ రాజకుమారి


గాయపడిన బాలుడితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

పాణ్యం: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం పాణ్యం సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ల నైట్ డ్యూటీ రోస్టర్ పట్టికను తనిఖీ చేశారు. ప్రతి నెలకు ఎన్ని కాన్పులు చేస్తున్నారని వైద్యులను ప్రశ్నించి సిజేరియన్ కాన్పులు అధికంగా జరుగుతుండడంతో కారణాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో నలుగురు డాక్టర్లు ఉండగా అనస్తీయా డాక్టర్ మునిస్వామి మాత్రమే విధుల్లో ఉండగా మిగిలిన వారు ఎక్కడని ప్రశ్నించగా, ఒకరు నైట్ డ్యూటీ, మరొకరు ట్రైనింగ్ వెళ్లారని బదులిచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం పాణ్యం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎస్‌ఎం భవనం కోసం ఎకరా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాగులు ఎకరాల భూమికి సంబంధించి ప్రతిపాదనలు త్వరగా పంపాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డిని ఆదేశించారు. చెంచుకాలనీలో గృహనిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు.

మహానందిలో వైభవంగా పదహారు రోజుల పండుగ


పూజలు చేస్తున్న పండితులు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం మహానందిలో గురువారం పదహారు రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, దేవికల ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు జనార్ధన్, మహేశ్వరయ్య ముందుగా యాగశాలలో అంకురాలకు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాల తొలిరోజు పుట్టమన్ను తెచ్చి పాలల్లో తడిపిన నవధాన్యాలతో చేసిన అంకురార్పణలో వచ్చిన మొలకలను రుద్రగుండం కోనేరులో శాస్త్రీయంగా కలిపారు. ఈ ఏడాది మొలకలు బాగా వచ్చాయని, పంటలు బాగా పండుతాయని పండితులు చెప్పారు. అనంతరం రథం వద్దకు చేరుకుని రథాంగ దేవతలను పూజించి వారిని స్వస్థానాలకు పంపి రథాన్ని రథమండపంలోకి చేర్చారు. దీంతో శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరుల కళ్యాణ, బ్రహ్మోత్సవ దీక్ష ముగిసిందని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. మహానంది, నంద్యాల ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్య మహిళలు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వారి దంపతులకు వడిబియ్యం(చీర,సారె) సమర్పించి పూజలు చేశారు.

ఎమ్మెల్యే చెప్పారని రూ.కోటి స్థలం ధారాదత్తం

పిరమిడ్ ధ్యాన కేంద్ర నిర్మాణానికి కేటాయింపు

- గతంలో కేవీఎస్ పార్కులో స్థలం కేటాయింపునకు కౌన్సిల్ ఆమోదం
- ప్రస్తుతం అన్న క్యాంటీన్ వద్ద అనుమతులు
- ప్రజోపకరమైన స్థలాలను ప్రైవేటు సంస్థలకు కేటాయించడం పట్ల ప్రజల ఆగ్రహం


పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

డోన్: ప్రజోపకరమైన ప్రభుత్వ స్థలాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా ధారాదత్తం చేస్తున్నారు. డోన్ మున్సిపల్ పరిధిలోని కేవీఎస్ పార్కు ఆవరణలో ఐదు సెంట్ల స్థలాన్ని గత ఏడాది పిరమిడ్ ధ్యానకేంద్రం నిర్మాణానికి కేటాయిస్తున్నట్లు కౌన్సిల్ తీర్మానం చేసింది. అయితే ఆ స్థలాన్ని కాదని కొత్తపేటలోని అన్న క్యాంటీన్‌తో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్న సర్వే నంబర్ 281లో పిరమిడ్ ధ్యానకేంద్రం నిర్వాహకులు వారం రోజుల క్రితం ధ్యానకేంద్రం నిర్మాణానికి ఏకంగా భూమిపూజ చేశారు. దీంతో మున్సిపల్ చైర్మన్‌తో పాటు కౌన్సిల్ సభ్యులు ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. కేవలం ఎమ్మెల్యే మౌఖికంగా చెప్పారని కమిషనర్ ఏకపక్ష నిర్ణయంతో ప్రజోపకరమైన స్థలాలను ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు కట్టబెట్టడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎవరికి వారు కౌన్సిల్ ఆమోదం లేకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కోటి రూపాయల విలువైన స్థలాన్ని ప్రైవేటు సంస్థకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. ఈ ధార్మిక సంస్థకు పట్టణంలో ఏ మూలకైనా స్థలం కొనుగోలు చేసే శక్తి ఉండగా.. ప్రజలకు ఉపయోగపడే స్థలాన్ని ఉచితంగా కేటాయించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న తలెత్తుతోంది.

ఎమ్మెల్యే చెబితే నిర్మించుకోమన్నాం

281 సర్వే నంబర్‌లోని అన్న క్యాంటీన్ వద్ద పిరమిడ్ ధ్యానకేంద్రాన్ని అనధికారికంగా నిర్మించుకోమన్నాం. గత కౌన్సిల్‌లో పిరమిడ్ ధ్యాన కేంద్రానికి కేవీఎస్ పార్కులో స్థలం కేటాయించిన విషయం నాకు తెలియదు. స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకే నిర్ణయం తీసుకున్నాం. – ప్రసాద్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, డోన్

చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి

- కేఎల్‌ఎస్‌ఆర్ కంపెనీపై మృతుడి భార్య ఫిర్యాదు

నందికొట్కూరు: ప్రమాదవశాత్తూ గుంతలో పడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో కేజీ రోడ్డు వెంట కేఎల్‌ఎస్‌ఆర్ కంపెనీ పైపులైన్ కోసం గుంతలు తవ్వించింది. కాగా గ్రామంలో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్న గొల్ల చిన్న శేషన్న ఈ నెల 11వ తేదీన రాత్రి షాపు ముగించుకుని ఇంటికెళ్తూ ప్రమాదవశాత్తుతో కాలువలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందించి ఇంటికి పంపించారు. అదే రోజు అర్ధరాత్రి తలనొప్పి రావడంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ చిన్న శేషన్న మృతి చెందాడు. అయితే కేఎల్‌ఎస్‌ఆర్ కంపెనీ నిర్లక్ష్యంతోనే తన భర్త ప్రమాదానికి గురై మృతి చెందాడని చిన్న శేషన్న భార్య జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పాములపాడు: పొలంలో కోత మిషన్‌కు విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన మద్దూరు పంచాయతీలోని కృష్ణానగర్ గ్రామంలో చోటు చేసుకుంది. అదే గ్రామానికి కామేశ్వరరావు (45), శ్రీనివాసరావు ఇద్దరు కలిసి వారం రోజుల క్రితం మొక్కజొన్న కోత మిషన్‌ను తెచ్చారు. గురువారం ఒక రైతు పొలంలో కోత పూర్తవ్వగానే మరో పొలంలోకి కోత మిషన్‌ను తరలిస్తున్నారు. ఆ క్రమంలో పంట కాల్వ గట్టుపైకి మిషన్ ఎక్కుతుండగా విద్యుత్ తీగలు తగిలే అవకాశం ఉందని డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసరావు గుర్తించాడు. అయితే కామేశ్వరరావ ఓ బొంగుతో విద్యుత్ తీగలను పైకి ఎత్తి పట్టుకున్నాడు. కాగా అదుపుతప్పి విద్యుత్ తీగలు కోత మిషన్‌పై పడ్డాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ కిందకు దూకి ప్రాణాలు కాపాడుకోగా.. మిషన్‌పై ఉన్న కామేశ్వరరావు విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. వెంటనే ఆత్మకూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్ ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ అమెనిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రతి లబ్ధిదారుని ఇంటింటికి వెళ్లి అదనపు ఆర్థిక సహాయం గురించి తెలియజేయాలని ఆదేశించారు. సర్వే సిబ్బంది సంబంధిత లాగిన్‌లో వివరాలు పొందుపరిచి లబ్ధిదారులతో జియో టాగింగ్ చేసి అప్ లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 కింద జిల్లాకు 21,711 గృహాలు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులకు గతంలో ఒక యూనిట్‌కి రూ. 1.80 లక్షల రూపాయలు వచ్చేదన్నారు. వీటికి అదనంగా ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 75 వేలు, పీవీటీజీలకు లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. జిల్లాలో గృహాలు నిర్మించుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీల లబ్ధిదారులకు రూ. 114.24 కోట్ల అదనపు సాయం అందుతుందన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి 7,069 గృహాలు పూర్తిచేయాలని లక్ష్యంలో భాగంగా ప్రతి రోజు ప్రతి మండలంలో మూడు గృహాల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ మేర పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పీఎం జన్మన్ కింద ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యంలోని చెంచుగూడేలలో 527 గృహాలు నిర్మించాల్సి ఉందని అందుకు యూనిట్ విలువ 2.29 లక్షల రూపాయలకు అదనంగా మరో లక్ష రూపాయలు అదనపు సాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శ్రీహరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలో ఎక్కువగా తిరగొద్దు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ



కర్నూలు (హాస్పిటల్): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎండల్లో ఎక్కువ తిరగరాదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు ఉదయం 11 గంటల లోపు తమ పనులు ముగించుకుని నీడ గల ప్రదేశాల్లో ఉండాలని తెలిపారు. ఎండలో తప్పనిసరిగా తిరగాల్సి వస్తే గొడుగు, టోపీ ధరించాలన్నారు. వెంట నీళ్ల బాటిల్ ఉంచుకుని గంటగంటకూ తాగుతూ ఉండాలని సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యసహాయం అందేలా చూడాలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అన్ని సచివాలయాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు తరచూ పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు.

పొట్టేలు బండిపై జాతరకు

పోలకల్ చెన్న సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహారథోత్సవం నేపథ్యంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు గురువారం ఫలహార బండ్లతో వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎడ్ల బండ్లను ప్రత్యేకంగా అలంకరించుకుని ఫలహారాలతో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. పోలకల్ గ్రామానికి చెందిన శ్రీరాములు అనే రైతు తన రెండు పొట్టేళ్లతో ఫలహార బండితో ఆలయానికి చేరుకోవడం అందరినీ ఆకట్టుకుంది. – సి.బెళగల్



హాస్యం.. అలరించిన నృత్యం



కామన్న వేడుకల్లో భాగంగా గురువారం హొళగుంద గ్రామంలో యువకులు ప్రదర్శించిన నృత్యం అలరించింది. అలాగే హాస్య ప్రదర్శన నవ్వించింది. గ్రామానికి చెందిన వీరేష్ సన్యాసి వేషం ధరించి తన శిష్య బృందంతో పాటలు పాడుతూ వీధి వీధి తిరిగారు. చిన్నారులు, యువకులు ఒకేరకమైన దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణతో చెక్కభజన మాదిరిగా నృత్యాలు చేశారు. కామన్న వేడుకలు శనివారం ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. – హొళగుంద



'దిష్టి'బొమ్మా.. ఏ కన్ను పడనీకమ్మా!

పంటను కాపాడుకునేందుకు రైతులు చేయని ప్రయత్నమంటూ ఉండదు. విత్తనం వేసింది మొదలు.. పంట కోత వరకు కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిందే. ఈ కోవలోనే మండలంలోని నునసరాల్ల నుంచి తువ్వదొడ్డికి వెళ్లే దారిలో దానిమ్మ, అరటి తోటకు దిష్టిబొమ్మలను ఏర్పాటు చేయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సాధారణంగా కొత్త ఇంటికి దిష్టిముఖం బొమ్మలను ఏర్పాటు చేస్తుంటారు. పొలాల్లో అయితే మనిషి ఉన్నట్లుగా భ్రమింపజేయడానికి కట్టెకు అంగీ, ప్యాంటు తొడిగించి ఉంచుతారు. అయితే అలాంటి బొమ్మల తలకు దిష్టిముఖాలను తగిలించడం ఆ దారిన వెళ్లే వారందరికీ నవ్వు తెప్పిస్తోంది. – తుగ్గలి



దానిమ్మ తోటలో ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మ, అరటి తోటలో ఇలా..